సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలి

కథలాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని టీఎస్ యుటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుక్కోవెల శ్యాంసుందర్, అంబటి భూమేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చింతకుంట, కథలాపూర్ సహా పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించిన అనంతరం మాట్లాడారు. జీఓ నంబర్ 25 సవరించి ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సర్దుబాటు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఖలీద్‌పాషా, మండల అధ్యక్షుడు పిట్టల రవీందర్, మండల బాధ్యులు రాజేశ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా దీపోత్సవం

● భక్తుల ప్రత్యేక పూజలు ❼



ధర్మపురిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పల్లె పోరుకు కసరత్తు

- పాత రిజర్వేషన్ పద్ధతిలోనే పంచాయతీ ఎన్నికలు
- జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీకి పలువురి ఆసక్తి
- తొలుత జీపీ ఎన్నికల నిర్వహణతో ఆశావహుల్లో సందిగ్ధం
- ఓటర్ల జాబితా సవరణ షురూ
- 23వ తేదీన తుది జాబితా

జగిత్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి మళ్లీ మొదలైంది. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఆశావహుల్లో రిజర్వేషన్లపై ఉత్కంఠ నెలకొంది. గతంలో ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువడి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన అనంతరం హైకోర్టు తీర్పుతో నిలిచిపోయిన విషయం తెలిసిందే. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కేటాయింపులో అడ్డంకుల నేపథ్యంలో పాత రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతోంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీ పరంగా ఉండకపోయినప్పటికీ ప్రధాన పార్టీలు తమ మద్దతుదారులను బరిలో నిలపడానికి సమాయత్తం అవుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ 42శాతం సీట్ల కేటాయింపుతో ఎన్నికలకు వెళ్తామన్న ఆలోచనతో నాయకుల్లో చర్చలు మొదలయ్యాయి. ఇక గ్రామాల్లో మరోసారి ఎన్నికల వేడి ప్రారంభం కాగా ఆశావహులు తమ ప్రయత్నాల్లో భాగంగా గెలిపిస్తే అన్ని పనులు చేస్తామనే హామీ ఇస్తున్నారు. జిల్లాలో 20 జడ్పీటీసీ స్థానాలు, 216 ఎంపీటీసీ స్థానాలు, 20 ఎంపీపీ స్థానాలు, 385 సర్పంచ్ స్థానాలు, 3,586 వార్డు సభ్యుల స్థానాలు ఉన్నాయి.

గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలు..

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయి. పారిశుధ్యం, వీధి దీపాలు, ఇతర సమస్యలు రాజ్యమేలుతున్నాయి. 2019 జనవరిలో పంచాయతీ ఎన్నికలు జరగ్గా అదే యేడాది ఫిబ్రవరి 2న పాలక వర్గాలు బాధ్యతలు చేపట్టాయి. వీరి పదవీ కాలం 2024 ఫిబ్రవరి 1న ముగిసినప్పటికీ ఇప్పటి వరకు ఎన్నికలు జరగలేదు. దీంతో దాదాపు రెండేళ్లుగా ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. 2019 మేలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అదే యేడాది జూన్ 4వ తేదీన పరిషత్ పాలకవర్గాలు ఏర్పాటు అయ్యాయి. గత యేడాది జూన్‌తో పదవీ కాలం ముగియగా దాదాపుగా 17 నెలల నుంచి ఎన్నికలు జరగలేదు. దీంతో ఆయా గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు సైతం ఆగిపోయాయి. గ్రామాలకు

మిగతా 8వ పేజీలో..

ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు బిజీ..

పంచాయతీ ఎన్నికలకు ఈనెలలో షెడ్యూల్ జారీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. డిసెంబరు రెండో వారంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారన్న చర్చలు జోరుగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మరోమారు అధికారులు ఎన్నికల ఏర్పాటు పనులలో బిజీగా మారారు. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామాల్లో ఓటరు జాబితా సవరణ కోసం నిర్ణయం తీసుకుంది. గతంలో వెల్లడించిన జాబితా నమోదు కాకుండా ఇటీవల కొత్తగా వచ్చిన దరఖాస్తుల పరిశీలన, ఇదివరకు ఉన్న వాటిలో తప్పుల సవరణ, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారంపై దృష్టి సారించారు. ఈనెల 23న పంచాయతీ, వార్డుల వారీగా తుది ఓటరు జాబితాను విడుదల చేయడానికి కసరత్తులు చేస్తున్నారు. మరోవైపు తుది ఓటరు జాబితా తయారీతో పాటు షెడ్యూల్, పోలింగ్ సిబ్బంది, పోలింగ్ కేంద్రాలు, సామాగ్రి, అధికారులు, పరిశీలకులు, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు, మోడల్ కోడ్ కమిటీ, శాంతి భద్రతలు తదితర అంశాలపై అధికారులు దృష్టి సారించారు. జగిత్యాల జిల్లాకు ఎన్నికల పరిశీలకుడిగా ఐఏఎస్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డిని నియామకం చేశారు.



రహదారి పనులు ప్రారంభించాలి

మెట్‌పల్లి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని ఆరపేటలో గల అమ్మవారి దేవాలయానికి వెళ్లే మార్గానికి రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు అధికారులను కోరారు. గురువారం వారు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జెట్టి లింగంతోకలిసి ఆరపేటలోని అమ్మవారి ఆలయ రహదారి మార్గాన్ని మెట్‌పల్లి మున్సిపల్ డీఈ, ఏఈ, మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్వర్, డ్రాప్ సాంక్షన్ అయినందున నిర్మాణ పనులను కాంట్రాక్టర్ తక్షణమే చేపట్టాలని ఆదేశించారు.

రక్తదాన శిబిరం

కోరుట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పశువైద్య కళాశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల మెడికోలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ శ్రీనివాస్ మాట్లాడుతూ యువత సామాజిక సేవలో పాల్గొనాలని అన్నారు. సేకరించిన రక్తంను జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి భద్రపరిచినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కొమ్ముల జీవన్ రెడ్డి, అల్లాడి ప్రవీణ్ కుమార్, గుంటుక చంద్రప్రకాష్, పిడుగు గుణాకర్ రెడ్డి, గాజెంగి నాగభూషణం, దనుంజయ్, కల్లెం గంగారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసహాయం

మల్యాల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం కొండగట్టుకు చెందిన బొంగాని రాములు అనే వృద్ధుడు గురువారం మృతిచెందగా మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచన మేరకు ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు స్థానిక మాజీ సర్పంచ్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ రూ.5వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముత్యం శంకర్‌గౌడ్, గుర్రం మల్లేశంగౌడ్, పంజాల మల్లేశంగౌడ్, బండి రవిగౌడ్ తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

-కలెక్టర్ సత్యప్రసాద్



ధాన్యం కొనుగోలు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

మల్లాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట, రాఘవపేట, ఓబులాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను గురువారం కలెక్టర్ సత్యప్రసాద్ సందర్శించారు. కేంద్రాల నిర్వహణ, సౌకర్యాలు, ధాన్యం వాహనాల రాకపోకలు పరిశీలిన, ట్రక్ షీట్లను పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే రైస్‌మిల్లులను తరలించేలా రవాణా వ్యవస్థలను బలోపేతం చేయాలని, లారీ రవాణాలో ఎలాంటి షార్టేజ్ లేకుండా నిశితమైన పర్యవేక్షణ ఉండాలన్నారు. ధాన్యం బరువు కొలతలు, తేమ శాతం పరీక్షలు, సంచుల సీలింగ్, రసీదుల జారీ వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా పారదర్శకంగా కొనుగోలు జరగాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు త్రాగునీరు, నీడ, టోకెన్ వ్యవస్థ, రద్దీ తగ్గించే చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, డీసీవో మనోజ్‌కుమార్, తహసీల్దార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రాస్తారోకో



మల్లాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

మల్లాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్‌లోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ గురువారం మొక్కజొన్న రైతులు రాస్తారోకో చేశారు. కొనుగోళ్ల ఆలస్యం కావడంతో వారం రోజులుగా ఇబ్బందులు పడుతున్నామని మొక్కజొన్న రైతులు వాపోయారు. కుంటి సాకులు చెబుతూ కాంటాలు చేయడం లేదని, తేమ శాతం పరిశీలించడం లేదని పలువురు మొక్కజొన్న రైతులు రోడ్డెక్కి ఆందోళన చేశారు. త్వరగా కొనుగోళ్ల జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలలని రైతులు డిమాండ్ చేశారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

-డీఎంహెచ్‌వో ప్రమోద్

బీర్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ అన్నారు. బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో గల హెల్త్ సబ్ సంటర్‌ను జిల్లా వైద్యాధికారి ప్రమోద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ రికార్డులు పరిశీలించి ఎక్కువగా ఏ విధమైన రోగులు వస్తుంటారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, సీహెచ్‌వో కుద్దీస్, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు తదితరులు ఉన్నారు.

'ఆత్మనిర్భర్' లక్ష్యసాధనకు కృషి చేయాలి

● అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్

జగిత్యాలరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆత్మనిర్భర్ పథక లక్ష్య సాధనకు కృషి చేయాలని అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్ అన్నారు. ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ పథకం అమలు ఏర్పాటుపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధికై బ్యాంకుల ద్వారా ఆర్థికసాయం పొందుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానం పెంపు

జగిత్యాల అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పుస్తక పఠనంతో జ్ఞానం పెంపొందుతుందని జిల్లా అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అన్నారు. 58వ గ్రంథాలయ వారోత్సవాల చివరి రోజైన గురువారం జగిత్యాల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన ముగింపు ఉత్సవాలలో పాల్గొన్న ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు గ్రంథాలయానికి వెళ్ళి పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని సూచించారు.

అంతకు ముందు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంబించిన ఆయన గ్రంథాలయ వారోత్సవాలలో ఏర్పాటు చేసిన వివిధ పపోటీలలపో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము, పిఆర్టీయు జిల్లా అధ్యక్షులు బోయినిపెల్లి ఆనందరావు, ప్రముఖ కవయిత్రి అయిత అనిత, గ్రంథపాలకులు బి. శకుంతల, బి. కవిత, సరోజన, తరంగిణి, అనలిత, చందన, మోహన్ రెడ్డి, జమున, కృష్ణ, మురళీ, రాజ్ కుమార్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన

● అర్హతలు ఉన్నా డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించలేదని మహిళల నిరసన

జగిత్యాల టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అర్హతలు ఉన్నా తమకు డబుల్ బెడ్‌రూం ఇళ్ళు కేటాయించలేదని జగిత్యాల పట్టణానికి చెందిన పలువురు మహిళలు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ క్యాంపు కార్యాలయం ఎదుట గురు వారం ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు అక్కడికి చేరుకొని నచ్చచెప్పారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ క్యాంపు ఆఫీసుకు రాగానే బాధిత మహిళలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇంతవరకు జరిగిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపులో అనర్హులు ఉన్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అర్హులమైన తమకు అధికారులు ఇళ్ల



జగిత్యాలలో ఆందోళన చేస్తున్న మహిళలు

కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిళలతో మాట్లాడుతూ ఈ విషయంపై అధికారులతో మాట్లాడి విచారణ జరిపించి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

రాజకీయ దురుద్దేశంతోనే విమర్శలు

-ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాజకీయ దురుద్దేశంతోనే కొందరు తనపై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలో గూడు లేని నిరుపేదలకు ప్రతిష్టాత్మకంగా నూకపెల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీ నిర్మించామన్నారు. పట్టణంలో గూడు లేని నిరుపేదల ఎంపిక కోసం వార్డు సభలను నిర్వహించామన్నారు. అసలైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు తహసీల్దార్లు, ఇతర అధికారులు విచారణ చేపట్టారన్నారు. కలెక్టర్ పర్యవేక్షణలో ఎంపిక జరిగిందని పేర్కొన్నారు. ఇళ్లు రాని ప్రజలు ఆందోళన చెందవద్దని, మిగిలిన డబుల్ బెడ్‌రూం గృహాలు అర్హులందరికీ అందజేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

● యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి రోశిని జైస్వాల్

జగిత్యాల అర్బన్, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి రోశిని జైస్వాల్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన యూత్ కాంగ్రెస్ సమావేశానికి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరం రాజేష్, రాష్ట్ర కార్యదర్శి తాటిపర్తి వినూత్నతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ చేసే ప్రతి కార్యక్రమాన్ని ఎన్‌వైసి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జగిత్యాల అసెంబ్లీ కన్వీనర్ నల్ల స్వామి రెడ్డి, రాగుల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం

రాయికల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో యువన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన జాతీయ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రోషిని జైస్వాల్‌ను గురువారం రాయికల్ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బీరం రాజేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని నాగరాజు, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బాపురపు రాజీవ్, బొద్దుల శివ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి రోశిని జైస్వాల్

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

● రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

జగిత్యాల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం గ్రామపంచాయతీ ఎన్నికలు, ఓటరు జాబితా తయారీపై ఆమె జిల్లా కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఇందులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్‌తోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలోనే ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, మూడు విడతల్లో జరిగే ఈ ఎన్నికలకు ప్రతి ఫేజ్‌లో ఏ మండలాల్లో ఎన్నికలు ఉంటాయో జిల్లా వారీగా ప్రణాళిక అందించాలన్నారు. పాత పద్ధతిలోనే రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. సెప్టెంబర్ 2న విడుదల చేసిన పంచాయతీ తుది ఓటరు జాబితాపై ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించి ఈనెల 22లోగా పరిష్కరించాలని కోరారు. 23న ప్రతి గ్రామపంచాయతీకి సంబంధించి పోలింగ్ కేంద్రాలు, ఫోటోలతో కూడిన ఓటరు జాబితా ప్రచురణ పూర్తి చేయాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ఎంసీసీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలకు కలెక్టర్లు సిద్ధంగా ఉండాలని, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని సూచించారు. రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఎస్పీలకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రేవంత్‌తో పాటు పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పార్టీ మారకపోతే బీఆర్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనాలి

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు

జగిత్యాల టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పార్టీ మారకపోతే బీఆర్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విద్యాసాగర్ రావు మాట్లాడుతూ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారలేదని.. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకోలేదని పేర్కొంటున్నాడన్నారు. అలాంటప్పుడు బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే కార్యక్రమాలలో పాల్గొని మా పార్టీ కార్యకర్తలతో తిరగాలని అన్నారు.

ఇటీవల బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారంలో బీఆర్ఎస్ కార్యకర్త ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు బీఆర్ఎస్ కండువా కప్పేందుకు ప్రయత్నిస్తే పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. మీరు పార్టీ మారకపోతే జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి రావాలని.. మీకు కండువా కప్పాడానికి సిద్ధంగా ఉన్నామని, మా సవాల్‌ను స్వీకరించి రావాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కోరారు. కేసీఆర్‌ను నోటికొచ్చిన మాటాలు మాట్లాడి, ప్రజలను రెచ్చగొట్టి జుబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలుపొందారని పేర్కోన్నారు. అమలు కానీ హామిలు ఇచ్చి ప్రజలను మోసం చేసి గెలుస్తున్నారు.. కేసీఆర్ హయాంలో తెలంగాణ ఎలా ఉంది.. ఇప్పుడు ఎలా ఉందో ప్రజలు ఒకసారి ఆలోచించాలని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు వస్తున్నాయి మళ్ళీ మోసం చేస్తారని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజి జడ్పీ చైర్ పర్సన్ దావా వసంత సురేష్, మాజి కౌన్సిలర్లు దేవేందర్ నాయక్, ఆవారి శివకేసరి బాబు, పిఎసిఎస్ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, తుమ్మ గంగాధర్, అయల్నేని ఆనంద్‌రావు, వెంకటేశ్వర్‌రావు, నీలి ప్రతాప్, హరిష్ కల్లూరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

మద్యం మత్తులో యువకుడి హంగామా

● ఒంటిపై గాయాలు చేసుకుని వీరంగం



ఒంటిపై గాయాలతో సాయికుమార్

తంగళ్లపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు మండల కేంద్రంలో హంగామా సృష్టించాడు. మండేపల్లి మూలమలుపు వద్ద తంగళ్లపల్లికి చెందిన సాయికుమార్ కుటుంబ కలహాలతో మద్యం మత్తులో కత్తితో ఒంటిపై గాయాలు చేసుకుని వీరంగం చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని ఆసుపత్రికి తరలించారు.

పార్వతీపురం పోలీస్ క్వార్టర్‌లో నాగుపాము కలకలం



నాగుపాము పడుతున్న జగదీష్

వేములవాడ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం వెనుకవైపు ఉన్న పార్వతీపురం పోలీస్‌క్వార్టర్‌లో గురువారం రాత్రి నాగుపాము దూరి కలకలం సృష్టించింది. ఆలయ పార్వతీపురం 13ఏలో ఆలయభద్రతా సిబ్బంది నివాసం ఉంటారు. ఈ పోలీస్‌క్వార్టర్‌లో అయిదు అడుగులనాగుపాము ప్రత్యక్షమైంది. ఇదిచూసిన భద్రతాసిబ్బంది స్నేక్‌క్యాచర్ జగదీష్‌కు సమాచారం అందించారు. అతను వచ్చి పామునుపట్టి దూరంలో వదిలిపెట్టాడు.

కొండచిలువ హతం



గర్రెపల్లిలో కొండ చిలువ

సుల్తానాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గర్రెపల్లిచెరువు సమీపంలోని వైకుంఠ ధామం వద్ద రహదారిపై రైతులకు కొండ చిలువకనిపించింది. ఈదారివెంట వెళ్లా లంటే భయంగా ఉందని రైతులు పేర్కొన్నారు. గర్రెపల్లి మీదుగా గొల్లపెల్లి, సాంబయ్యపల్లి, నారాయణరావుపల్లి గ్రామాలకుచెందిన వారు ఈదారి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. రైతులు కర్రలతో కొట్టడంతో చనిపోయింది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రామగుండానికి చెందిన ఆకుల శివ కుమార్ అనేవ్యక్తి అక్టోబరు 26న తన సెల్‌ఫోన్‌ను ఆరెపల్లి వద్ద పోగొట్టుకుని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆ సెల్‌ఫోన్ హైదరాబాద్‌లో ఒక వ్యక్తి వద్ద ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బాధితుడిని గురువారం రూరల్ స్టేషన్‌కు పిలిచి సీఐ ఏ నిరంజన్‌రెడ్డి సెల్‌ఫోన్‌ను అందజేశారు.

పరిశ్రమల అభివృద్ధికి ఉద్యమ్

● బ్యాంకు రుణాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



చొప్పదండి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహ పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఉద్యమ్ పోర్టల్‌ను తీసుకువచ్చింది. నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందేందుకు, వ్యాపార రంగంలో స్థిరపడేందుకు బ్యాంకులు రుణాలు అందజేస్తుంటాయి. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉంటేనే బ్యాంకులు రుణాలు అందజేస్తున్నాయి. ఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సంస్థల అధికారిక గుర్తింపుగా పని చేస్తుంది. తక్కువ వడ్డీ ప్రయోజనాలు కలిగిన ఉన్న వివిధ పథకాలు, గ్యారంటీ లేని రుణాల కోసం ఉద్యమ్ పోర్టల్‌లో తప్పనిసరంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

ప్రయోజనాలు...

ప్రభుత్వ పథకాల ద్వారా నిరుద్యోగులు, వ్యాపారులు పొందే రుణాల్లో వడ్డీ రాయితీ, గ్యారంటీ లేకుండా రుణం పొందే అవకాశం, తక్కువ వడ్డీకే రుణాల లాంటి ప్రయోజనాలు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌తో కలుగుతాయి. ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ ద్వారా అందించే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కాగిత రహితంగా పూర్తిగా ఆన్‌లైన్‌లో జరిగే ప్రక్రియ. రిజిస్ట్రేషన్ పూర్తయిన అనంతరం యూఆర్ఎన్ నంబర్‌తో కూడిన ధ్రువీకరణ పత్రం లభిస్తుంది. సంస్థకు ఒక శాశ్వత సంఖ్యతో ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. ఆధార్, పాన్ లింకు కలిగి ఉండి, పట్టణాల్లో అయితే స్ట్రీట్ వెండర్లకు, ముద్ర రుణాల దర ఖాస్తుదారులకు, పరిశ్రమలు, సేవా రంగంలో వ్యాపారం కోసం పీఎంఈజీపీ లాంటి పథకాలలో బ్యాంకు రుణాలు తీసుకునేవారికి ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని బ్యాంకు అధికారులు చెప్తున్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవడం ఇలా...

www.udyamregistration.gov.inఅనే వెబ్‌సైట్‌లో ఫర్ న్యూ ఎంటర్‌ప్రెన్యూర్స్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. దానిలో ఆధార్ జూంబర్, పేరు నమోదు చేసి జనరేట్ చేయగానే ఆధార్ కార్డుకు లింకు ఉన్న మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేయగానే పాన్‌కార్డు నంబర్, వివరాలు అడుగుతుంది. పాన్‌కార్డు వివరాలు ఎంటర్ చేయగానే మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ, సామా జిక వర్గం, వ్యాపార సంస్థ పేరు, చిరునామా, సంస్థ రిజిస్ట్రేషన్ వివరాలు, బ్యాంకు వివరాలు, పెట్టుబడి వివరాలు నమోదు చేయాలి. అన్ని వివరాలు సరిచూసుకున్న తర్వాత దరఖాస్తును సబ్‌మిట్ చేయాలి. దరఖాస్తును సమర్పించగానే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ నంబర్ (యూఆర్ఎన్) చూపిస్తుంది. నమోదు చేసిన మెయిల్ ఐడీ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ వస్తుంది. ఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టి ఫికెట్‌ను కేంద్ర ప్రభుత్వ ఎం ఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ జారీ చేస్తుంది.

లొంగుబాటలో మావోయిస్టు నేత మల్లా రాజిరెడ్డి?

● మంతనాలు జరుపుతున్న బంధుమిత్రులు

● రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం..



మల్లా రాజిరెడ్డి(ఫైల్)

మంథని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సత్తెన్న లొంగుబాటుకు ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు సమాచారం. లొంగుబాటు కోసం మార్గం సుగమమయ్యేందుకు ప్రభుత్వ పెద్దలతో రాజిరెడ్డి బంధు, మిత్రులు సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ కగార్‌తో దండకారణ్యంలో చోటు చేసుకుంటున్న ఎన్‌కౌంటర్‌లు, పదులసంఖ్యలో అగ్రనేతలు మృత్యువాత, లొంగిపోయారు. ఈక్రమంలో రాజిరెడ్డి లొంగు బాటు కోసం వారు ప్రయత్నాలు చేస్తున్నారు. మరో రెండురోజుల్లో రాజిరెడ్డి లొంగుబాటుపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. మంథని మండలంలోని శాస్త్రులపల్లి గ్రామానికి చెందిన మల్లా రాజిరెడ్డి విప్లవ రాజకీయాలకు ఆకర్శితుడై దాదాపు 45ఏళ్లుగా పని చేస్తూ కేంద్ర కమిటీ సభ్యుడి స్థాయికి ఎదిగారు. కేంద్ర కమిటీ సభ్యుడిగా 2007లో కేరళలోని ఎర్నాకుళంలో పోలీసులు అరెస్టు చేయగా మంథని, మెట్‌పల్లి కోర్టులో హాజరుపర్చి జైలుకు తరలించారు. కేసుల విచారణ అనంతరం బెయిల్ పై విడుదలైన రాజిరెడ్డి తిరిగి అజ్ఞాతంలోకి వెళ్లారు.

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం..

● బట్టల షాపునకు నిప్పు పెట్టుకున్న యజమాని ● అగ్నిప్రమాదమంటూ పోలీసులకు ఫిర్యాదు

● కుట్రను ఛేదించి ముగ్గురిని అరెస్టు చేసిన త్రీటౌన్ పోలీసులు

కరీంనగర్ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తాలో మహాలక్ష్మి ఫ్యాషన్‌మాల్‌లో ఈనెల 17న ఉదయం జరిగిన అగ్నిప్రమాదం కేసును త్రీటౌన్ పోలీసులు ఛేదించారు. ఇది ప్రమాదవశాత్తు జరిగింది కాదని, ఇన్సూరెన్స్ డబ్బుల కోసం యజమాని ఉద్దేశపూర్వకంగా చేసిన పని అని పోలీసులు గుర్తించారు. కరీంనగర్ త్రీటౌన్‌సీఐ జి జాన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మహాలక్ష్మి ఫ్యాషన్‌మాల్ యజమాని సంగం రాజేశ్ వ్యాపారంలో నష్టాలు రావడం, అప్పుల బాధతో ఇన్సూరెన్స్ డబ్బులు క్లెయిమ్‌చేసి బయటపడాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా తనవద్ద పనిచేసే రాకేశ్, మధుతో కలిసి కుట్రపన్నాడు. ఘటనకు ముందు షాపులోని విలువైన బట్టలను రహస్యంగా తరలించి, అనంతరం పెట్రోల్ పోసి షాపునకు నిప్పంటించారు. అనంతరం ఏమీ తెలియనట్లు రాజేశ్ డయల్ 100కు ఫోన్‌చేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. అయితే షాపులో ఒక మూలన మాత్రమే బట్టలు కాలిపోయి ఉండటం, సీసీ కెమెరాల డీవీఆర్ కాలిపోవటంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ జాన్‌రెడ్డికి అనుమానం కలిగింది. ఆ షాపులో సీసీ కెమెరాలను పరిశీలించేందుకు అవకాశం లేకుండా డీవీఆర్ కాలిపోయింది. దీంతో షాపు సమీపంలో, చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు షాపు యజమాని, వర్కర్, గుమాస్తాల కదలికలు అనుమానాస్పదంగా కలిపించాయి. దీంతో మరింత లోతుగా విచారణ జరిపి, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. నేరానికి వాడిన పెట్రోల్‌బాటిల్, సెల్‌ఫోన్, షాపునుంచి తరలించిన బట్టలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితులు సంగం రాజేశ్ (షాపు యజమాని), రాకేశ్ (వర్కర్), మధు (గుమస్తా)ను గురువారం అరెస్టు చేశామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో ఏడాది జైలు శిక్ష

కోల్‌సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని రమేష్‌నగర్‌కు చెందిన ఒక మహిళపై అత్యాచారయత్నం కేసులో నేరం రుజువు కావడంతో ఆమె మామ అయిత చంద్రయ్యకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ గురువారం గోదావరిఖని కోర్టు తీర్పునిచ్చింది. 2024 నవంబరు 27న తనపై అత్యాచారం చేశారంటూ బాధితురాలు గోదావరిఖని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ భూమేష్ కేసు నమోదు చేశారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, ఏపీపీ పద్మజ, అడిషనల్ జిల్లా, సెషన్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా న్యాయమూర్తి శ్రీనివాసరావు దోషికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన టిప్పర్

● కూలీలకు గాయాలు

బోయినపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌ను వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో కూలీలకు గాయాలైన సంఘటన బోయినపల్లి మండలం కొత్తపేట గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నీలోజిపల్లి గ్రామానికి చెందిన కోనుకటి రవీందర్‌కు చెందిన ట్రాక్టర్‌ను కొత్తపేట గ్రామానికి చెందిన కోనుకటి తిరుపతి అద్దెకు తీసుకున్నాడు. గురువారం కూలీలను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా డ్రైవర్ ఎర్రనాగరాజు కొత్తపేట ఎస్సీ కాలనీలో నిలిపాడు. వేములవాడకు చెందిన టిప్పర్ లారీని రెడ్డవేని జశ్వంత్ అనేవ్యక్తి నిర్లక్ష్యంగా, వేగంగా వచ్చి ట్రాక్టర్ ట్రైలర్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కూలీలు కుర్మ రాజవ్వ, ఎల్లండుల కమలవ్వ, ఎల్లండుల లచ్చవ్వ, కోనుకటి రమ్య, ట్రాక్టర్ డ్రైవర్ నాగరాజు రోడ్డుపై పడిపోగా వారికిగాయాలయ్యాయి. వారిని చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్ రమాకాంత్ తెలిపారు.

మోసం చేసిన కేసులో వ్యాపారి అరెస్టు

మంథని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించి మోసానికి పాల్పడిన గద్దలపల్లి లోని శ్రీలక్ష్మిప్రసన్న ఇండస్ట్రీస్ పార్ట్నర్ బైర్నేని వరప్రసాద్‌రావును అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ రాజు గురువారం తెలిపారు. 2023-24 సంవత్సరానికి చేసుకున్న ఒప్పందం ప్రకారం ఖరీఫ్‌సీజన్‌లో కొనుగోలు చేసిన వడ్లను రైస్‌మిల్లు ఇవ్వగా వారు 38,489క్వింటాళ్ల సివిల్‌సప్లై కార్పొరేషన్‌కు 25,680క్వింటాళ్ళ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా మిల్లు వ్యాపారులు వరప్రసాద్, తాటిపెల్లి శ్రీనివాస్‌లు అగ్రిమెంట్‌ను దుర్వినియోగం చేసి బియ్యాన్ని కార్పొరేషన్‌కు ఇవ్వకుండా రూ.12.37కోట్లు మోసం చేసినట్లు మేనేజర్ శ్రీకాంత్‌ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో తాటిపెల్లి శ్రీనివాస్‌ను అరెస్టు చేశామన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి



అభినవ్(ఫైల్)

వేములవాడ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డులో బుధవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి గోవింద్ అభినవ్(25) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణంలోని ఉప్పుగడ్డ వీధికి చెందిన అభినవ్ బద్దిపోచమ్మ దేవాలయంలో రోజువారికూలీగా పనిచేస్తుంటాడు. పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డు నుంచి ఇంటికి వెళుతుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి అభినవ్ మురికికాలువలో పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈవిషయం గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు సీసీకెమెరాలు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్‌సీఐ వీరప్రసాద్ తెలిపారు.

సిద్దిపేట జిల్లాలో మండేపల్లి వాసి మృతి



తిరుపతి(ఫైల్)

తంగళ్లపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన జడల తిరుపతి(58) మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం... సిద్దిపేటలో బంధువులు మృతిచెందగా పరామర్శకు జడల తిరుపతి-రజిత దంపతులు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో తిరుపతి అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య రజిత తీవ్రంగా గాయపడింది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ మహిళ మృతి



లచ్చవ్వ(ఫైల్)

మల్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన పున్న లచ్చవ్వ(59)అనే మహిళ ప్రమాదవశాత్తు నిప్పంటుకొని తీవ్ర గాయాలతో చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పున్న లచ్చవ్వ తన తల్లితో కలిసి పోతారంలో తమ్ముడి ఇంట్లో ఉంటోంది. మంగళవారం సాయంత్రం ఇంటిముందు గడ్డిని కాలుస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుంది. దీంతో చికిత్సకోసం జగిత్యాలఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా బుధవారం రాత్రి మృతిచెందినట్లు మృతురాలి సోదరుడు రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వరండాలోనే శిశువు మృతదేహం

● మానవత్వం మరిచిన ఆసుపత్రి సిబ్బంది

కళ్యాణ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గర్భంలో మృతి చెందిన శిశువును వరండాలో రాత్రి నుంచి ఉదయం వరకు ఉంచడంతో కుటుంబ సభ్యులకు ఏం చేయాలో తెలియక ఇబ్బందులకు గురయ్యారు. గోదావరిఖని ప్రభుత్వఆసుపత్రికి ప్రసవంకోసం మంథనికిచెందిన ఓగర్భిణి బుధవారం ఆసుపత్రిలో చేరింది. కడుపులోనే బిడ్డ అడ్డం తిరిగి మృతిచెందడంతో ఆమె భర్తకు శిశువును అప్పగించి ఆసుపత్రి సిబ్బంది చేతులు దులుపుకున్నారు. శిశువును ఏం చేయాలో అర్థంకాక లేబర్‌రూమ్ వద్ద పెయిడ్‌రూమ్‌ల వద్ద ఆ శిశువును ఉదయం 11గంటలవరకు అక్కడేఉంచారు. వాస్తవానికి శిశువు మరణించిన తరువాత కుటుంబ సభ్యుల అభిప్రాయం మేరకు ఆసుపత్రి సిబ్బంది ఖననం చేస్తారు. కానీ సిబ్బంది పట్టించుకోకుండా ఓ కాటన్ డబ్బాలో పెట్టి ఇవ్వడంతో ఏమి చేయలేక ఆ శిశువును మూలన పెట్టి ఉదయం వరకు జాగరణచేశారు. మృతిచెందిన శిశువును ప్యాకింగ్‌చేసి ఊరు చివరలో వైద్యసిబ్బంది ఖననం చేయాల్సి ఉంటుంది. శిశువును కాటన్ డబ్బాలో పెట్టి ఏమితెలియక గర్భిణి భర్త ఆసుపత్రి చుట్టూ తిరిగాడు. ఉదయం 11గంటలకు అక్కడున్నకొంతమంది శిశువు మృతదేహాన్ని చూసి వైద్యసిబ్బందిని ప్రశ్నించడంతో హడావిడిగా ఖననంచేశారు. ఆసు పత్రి సిబ్బంది ఇలా మానవత్వం మరవడంపై అక్కడున్నవారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పునుకప్పిపుచ్చుకోవడానికి సిబ్బందినానాతంటాలు పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మల్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు సమీపంలో గల మారుతీ టౌన్‌షిప్ వద్ద ఎదురెదురుగా కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికిగాయాలు అయ్యాయి. కోరుట్లకు చెందిన మనికంఠ, మకరంథ్ ద్విచక్ర వాహనంపై కళాశాలకు వెళ్లి తిరిగి వస్తుండగా టౌన్‌షిప్ ప్రాంతంలో ఎదురుగా కరీంనగర్ వైపు వస్తున్నకారు ఢీకొంది. దీంతో మనికంఠకాలుకు, మకరంథ్‌కు తీవ్ర గాయాలుకాగా చికిత్సకోసం జగిత్యాలకు తరలించారు.

వ్యక్తి అదృశ్యం

మల్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీకి చెందిన బోగ మధుసూధన్ అనేవ్యక్తి నెల రోజులుగా కనిపించడం లేదని అతడి భార్య సరిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. జగిత్యాలలోని ఓరైస్‌మిల్లులో పనిచేసే మధుసూదన్ గతనెల 8న పనికి వెళ్తున్నాననిచెప్పి ఇంటినుంచివెళ్లి తిరిగిరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసునమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ



లాకర్‌ను, హుండీని ధ్వంసం చేసిన దొంగలు

కోరుట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులోని పెద్దమ్మ దేవాలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ముదిరాజ్ సంఘ నాయకులు తెలిపారు. ఆలయంలోని ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఆలయంలో ఉన్న వెండి, బంగారు ఆభరణాలతో పాటు హుండీ, లాకర్‌లో ఉన్న నగదును ఎత్తుకెళ్లినట్లు వారు తెలిపారు. హుండీలో సుమారుగా రూ.6వేల వరకు నగదు ఉంటుందని వారు తెలిపారు. సంఘ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైపాస్ ఫ్లైఓవర్ గోడ ధ్వంసం



ధ్వంసమైన గోడ

కరీంనగర్ క్రైం, నవంబరు (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని బొమ్మకల్ బైపాస్‌రోడ్‌లో గ్రానైట్‌లారీ అదుపుతప్పి ఫ్లైఓవర్ గోడను ఢీకొట్టడంతో లారీలో ఉన్న భారీ గ్రానైట్‌రాయి ఫ్లైఓవర్ గోడకు తాకడంతో గోడ ధ్వంసమైంది. గురువారం రాత్రి 7గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సుల్తానాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న గ్రానైట్ లారీ అదుపుతప్పటంతో పెద్ద బండరాయి ఫ్లైఓవర్ గోడను ఢీకొంది. దీంతో గోడకు పెద్ద రంధ్రం ఏర్పడి ధ్వంసమైంది. ఫ్లైఓవర్ గోడకు పెద్దరంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా మారిందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

ఇల్లంతకుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్ కల్లూరి బాలరాజుపై దాడి చేసిన నిందితుడు పిట్ల శ్రీకాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్సై సిరిసిల్ల అశోక్‌లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం ఇల్లంతకుంట నుంచి సిరిసిల్లకు బయలుదేరింది. వల్లంపట్ల గ్రామసమీపంలో ఆర్టీసీ డ్రైవర్ సైడ్ ఇవ్వలేదని సిద్దిపేట జిల్లా చిన్నకోదూర్ మండలం గంగాపూర్‌కు చెందిన శ్రీకాంత్ కారు కొంత దూరం వెళ్లిన తర్వాత తిప్పుకొని వచ్చి ఆర్టీసీ బస్సుకు ఎదురుగా నిలిపాడు. డ్రైవర్ బాలరాజును దుర్భాషలాడి, బస్సు క్యాబిన్‌లోకి వచ్చి డ్రైవర్‌పై దాడిచేశాడు. బస్సు అద్దాన్ని పగలగొట్టడానికి రాయితో విసరగా అద్దం పగిలి రోడ్డుపక్కన కూర్చున్న వల్లంపట్ల గ్రామానికి చెందిన సంది వజ్రవ్వకు తగిలింది. ఘటనను ప్రశ్నించిన ఒబులాపూర్ గ్రామానికి చెందిన బత్తుల రాజవ్వ అనే ప్రయాణికురాలితో శ్రీకాంత్ వాగ్వాదానికి దిగాడు. బస్సులో జరిగిన ఘటనను బస్సు మహిళా కండక్టర్ కాళేశ్వరి తన మొబైల్‌ఫోన్‌లో వీడియో తీసింది. వీడియో సోషల్ మీడియాల్ వైరల్ కావడంతో నిందితుడు పరారయ్యాడు. ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు అయ్యింది. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో మూడు టీంలు ఏర్పాటు అయ్యి, సాంకేతిక ఆధారంగా గురువారం రహీంఖాన్‌పేట గ్రామసమీపంలో నిందితున్ని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ వద్ద పాతయంత్రాల తరలింపు వివాదం

కోల్‌సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్ నిర్మాణ కాంట్రాక్టు పనులు నిర్వహించిన సింప్లెక్స్ సంస్థ తన యంత్ర సామాగ్రిని తరలించే విషయంలో వివాదం నెలకొన్నది. ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ బయట ఉన్న ఈ సామాగ్రిని తరలిస్తుండగా ఆర్ఎఫ్‌సీఎల్ సామాగ్రి ఉందంటూ కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో తరలింపును నిలిపివేశారు. రెండు నెలల క్రితం ట్రాన్స్‌పోర్టర్ విషయంలో వివాదం నెలకొన్నది. ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు మాత్రం ఆసామాగ్రికి, మాకుసంబంధం లేదని పేర్కొంటున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇబ్రహీంపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి రూ.10 వేల జరిమానా విధించారు. గురువారం నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల గ్రామం నుంచి ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటికొండాపూర్ గ్రామానికి ఇసుకను ట్రాక్టర్ ద్వారా రవాణా చేస్తుండగా రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి రూ.10 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు.

ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయుల సస్పెన్షన్

● జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో ఉత్తర్వులు

హుజూరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం డీఈవో ఉత్తర్వులు జారీచేశారు. హుజూరాబాద్ మండలంలోని చెల్పూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎం అయిలయ్య విధులకు సక్రమంగా నిర్వహించడం లేదని, ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టించుకో వడం లేదనే ఫిర్యాదులు అందాయి. అలాగే హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్, ఏ సమ్మయ్యలు మద్యం తాగి పాఠశాలకు హాజరైనట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన డీఈవో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి నివేదిక అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయగా ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. హుజూరాబాద్ డివిజన్‌లోని సైదాపూర్, శంకరపట్నం, జమ్మికుంట ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు మద్యం సేవించి విధులకు హాజరవుతున్నట్లు ఆరోపణలున్నాయి.

జాతీయ స్కౌట్స్, గైడ్స్ క్యాంప్‌నకు ఖని విద్యార్థులు



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో

కోల్‌సిటీటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఈనెల 25నుంచి 29వరకు జరగనున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ జంబోరిలో పాల్గొనడానికి ఖని విద్యార్థులు గురువారం తరలివెళ్లారు. 8మంది స్కౌట్స్, 8మంది గైడ్స్, గైడ్ కెప్టెన్ విజయ, స్కౌట్ మాస్టర్ రవీందర్‌ల ఆధ్వర్యంలో శ్రీరామ విద్యానికేతన్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ సుల్తానాబాద్ విద్యార్థుల బృందం వెళ్లారు. రామగుండం ఎంఈవో జింక మల్లేశం జెండా ఊపి విద్యార్థుల వాహనాన్ని ప్రారంభించారు.

బీజేపీలో విభేదాలు లేవు

● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కరీంనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీజేపీలో విభేదాలు లేవని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. గురువారం కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఏ పార్టీలోనైనా అంతర్గత విభేదాలు సహజమని అన్నారు. స్థానిక ఎన్నికల్లో అందరం కలిసి పెద్ద మొత్తంలో స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. హుజూరాబాద్‌లో జరిగే కార్యక్రమాలపై తనకు సమాచారం ఉందని, తన వ్యక్తిగత కారణాలతోనే రాలేక పోయానన్నారు. బీజేపీ నాయకుల మధ్య గ్యాప్ ఉందన్నదని సోషల్ మీడియా సృష్టి మాత్రమే అన్నారు. మావోయిస్టుల లొంగుబాటు, ఎన్‌కౌంటర్లపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్టాండే తమ స్టాండ్ అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయితీల్లో పాలకులు లేక అభివృద్ధి కుంటుపడి పోయిందన్నారు. 25 సంవత్సరాలుగా ప్రజాక్షేత్రంలో ఉన్న నాయకుడిగా రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీకి పెద్ద ఎత్తున సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ స్థానాలను గెలిపించుకుంటామన్నారు.

● గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి

జమ్మికుంట రూరల్: గ్రామపంచాయతీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో పాలకవర్గాలు లేక రెండేళ్లు అవుతుందన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. 25ఏళ్లుగా ఇక్కడి ప్రజలతో అనుబంధం ఉందన్నారు. త్వరలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులు, సభ్యులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు సన్న వడ్లకు బోనస్ ఇచ్చి రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఫామ్‌లతో సంబంధం లేకుండా ప్రజలమధ్యలో ఉండి ప్రజలు మెచ్చిన నచ్చిన వాళ్లను గెలిపించుకుంటామన్నారు. ఇకనుంచి నియోజకవర్గంలో అందుబాటులో ఉంటానని తెలిపారు. సమావేశంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగెశోభ, ఎరబెల్లి సంపత్‌రావు, ఎర్రంరాజు సురేందర్‌రావు పాల్గొన్నారు.

ఉమ్మడిజిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ పోటీలు

● హాజరైన 130 మంది క్రీడాకారులు



రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-14, 17 రెజ్లింగ్‌పోటీలకు విశేషస్పందన లభించింది. జిల్లాకేంద్రంలోని ప్రాంతీయ క్రీడాపాఠశాలలో నిర్వహించిన ఈపోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధప్రాంతాల నుంచి 100మంది బాలురు, 30మంది బాలికలు హాజరయ్యారు. ఈ పోటీలను జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి బాసబోయిన వేణుగోపాల్, ఉమ్మడిజిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండీ కరీంలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రెజ్లింగ్ క్రీడకు మంచి ఆదరణ ఉందన్నారు. గతంలో జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ చాటారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని జిల్లా క్రీడాకారులు ఎదగాలన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లాజట్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ రిఫరీస్ బోర్డు కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాష్, పోటీల కన్వీనర్ బి సత్యనారాయణ, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు సఫియా, ఎన్ శ్యామలదేవి, రెజ్లింగ్ కోచ్‌లు వంశీకృష్ణ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల కష్టాలు తీరేదెప్పుడో..?



చిత్రవేణిగూడె వెళ్లే రోడ్డు

● చిత్రవేణిగూడెం, చిన్నకొల్వాయి గ్రామాలకు నడవని బస్సులు
● ఎటు వెళ్లాలన్నా మైళ్ల దూరం నడవాల్సిందే
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, వృద్ధులు

బీర్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాలాలు మారినా, ప్రభుత్వాలు మారినా గిరిజనులకు రవాణా సౌకర్యం కల్పించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీర్‌పూర్ మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చిత్రవేణిగూడెం, చిన్నకొల్వాయి గ్రామాల ప్రజలు ఎటు ప్రయాణం చేయా లన్నా మైళ్ల దూరం కాలినడకన వచ్చి ఆర్టీసీ బస్సు ఎక్కాల్సిందే. ఒకప్పుడు చిత్రవేణిగూడెం గ్రామం తాళ్లధర్మారానికి అనుబంధ గ్రామంగా, చిన్నకొల్వాయి గ్రామం కొల్వాయికి అనుబంధంగా ఉండేవి. నూతన పంచా యతీలు ఏర్పడిన తర్వాత చిత్రవేణిగూడెం, చిన్న కొల్వాయి గ్రామాలు జీపీలుగా ఏర్పడినా ఆర్టీసీ బస్సు సౌకర్యానికి మాత్రం నోచుకోవడం లేదు. దీంతో అత్యవసర సమయాల్లో వేరే ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని గిరిజనులు వాపోతున్నారు.

నాలుగు కి.మీ.లు నడిస్తేనే బస్సు

చిత్రవేణిగూడెం గ్రామ ప్రజలు ఏదైనా పని నిమిత్తం బీర్‌పూర్ మండల కేంద్రానికి వెళ్లాలంటే 10 కి.మీ.లు ప్రయాణించాలి. బస్సు సౌకర్యం లేక చిత్రవేణిగూడెం ప్రజలు బీఆర్‌పూర్ వెళ్లాలంటే 4 కి.మీ. కాలినడకన తాళ్లధర్మారం వరకు రావాల్సి ఉంటుంది. అక్కడి నుంచి బీఆర్‌పూర్‌కు బస్సులో వెళ్తారు. చిత్రవేణిగూడెంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా ప్రాంతాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులను చూసేందుకు తల్లిదండ్రులు, బంధువులు ఆయా ప్రాంతాల నుంచి పాఠశాలకు వస్తుంటారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తాళ్ళధర్మారం గ్రామంలోని ప్రధాన రహదారి వద్ద దిగి చిత్రవేణిగూడెంకు కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామానికి తారు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ బస్సులు రావడం లేదని గిరి జనులు పేర్కొంటున్నారు.

మండలంలోని కొల్వాయి గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నకొల్వాయికి కూడా బస్సు సౌకర్యం లేదు. దీంతో గిరిజనులు చిన్న కొల్వాయికి వెళ్లాలంటే కొల్వాయి నుంచి మైళ్ల దూరం నడవాల్సిందే. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అనుబంధ గ్రామాల ప్రజలకు సైతం బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి
: కోట్నాక గంగవ్వ, చిన్నకొల్వాయి



ప్రతి పనికి కొల్వాయి వెళ్లాలి. ఏదైనా ఊరికి వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు నడిచి వచ్చి బస్సు ఎక్కాలి. చిన్నపిల్లలు, వృద్ధులు నడవడం చాలా ఇబ్బంది అవుతుంది. సార్లు మా బాధలు పట్టించుకోవాలి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చిన్నకొల్వాయికి బస్సు సౌకర్యం కల్పించాలి.



చిన్న కొల్వాయికి వెళ్లే రోడ్డు

ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం
చిక్రం మారుతి, చిత్రవేణిగూడెం



గ్రామస్థులు ఏదైనా గ్రామం వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్ల దూరం కాలినడకన నడిచి వచ్చి బస్సు ఎక్కాలి. గ్రామంలోని 35మంది బాలికలు చదువుకోవడానికి నాలుగు కిలోమీటర్ల దూరం కాలినడకన తాళ్ళధర్మారం గ్రామానికి వచ్చి చదువుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి గ్రామస్థుల సమస్య తీర్చాలి.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు జడ్పీ విద్యార్థులు

చొప్పదండి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్గొండలో ఈనెల 22నుంచి జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ అండర్-17 పోటీలకు చొప్పదండి జడ్పీస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడిజిల్లా జట్టులోకి విద్యార్థులు టి తరుణ్, యు వినీత్, సీహెచ్ కృష్ణ, పి అక్షయ, బి శ్రీదేవి ఎంపికైనట్లు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఎండి జలీల్ తెలిపారు. ఈనెల12న జగిత్యాలలో జరిగిన ఉమ్మడిజిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

23న ఉమ్మడి జిల్లా సీనియర్స్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్ నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉమ్మడి కరీంనగర్ జిల్లాసీనియర్స్ మహిళలు, పురుషుల బాస్కెట్‌బాల్ జట్లఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9గంటలనుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బి అనంతరెడ్డి తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభచాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే ఉమ్మడిజిల్లా జట్లకుఎంపిక చేయనున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తిగల క్రీడాకారులు ఈపోటీలలో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఎస్‌యూ పీజీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎంఏ, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకామ్ (సీఏ), ఎంకామ్ (బ్యాంకింగ్ ఇన్సూరెన్స్), ఎంకామ్, సీఏ (ఎఫ్ఏ) కోర్సులకు మూడవ సెమిస్టర్ పరీక్షఫీజు షెడ్యూల్‌ను గురువారం శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షలు నియంత్రణ అధికారి డి.సురేష్‌కుమార్ విడుదల చేశారు. పరీక్షలు డిసెంబర్‌లో జరుగుతాయని తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని, లేదా ఆయా కళాశాలల్లో సంప్రదించాలని తెలిపారు.

కళాశాలల్లో ఫేస్ రికగ్నిషన్ తప్పనిసరి

● ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని డిగ్రీ, పీజీ ప్రభుత్వ, ప్రైవేటు, అనుబంధ కళాశాలల్లో ఫేస్‌రికగ్నిషన్ తప్పనిసరి అని ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్ తెలిపారు. గురువారం శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని డిగ్రీ,పీజీ ప్రభుత్వ, ప్రైవేటు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్, సెక్రెటరీలు, కరస్పాండెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ నిబంధనల మేరకు అన్ని కళాశాలల్లో విద్యార్థులకు ఫేస్ రికగ్నిషన్ తప్పనిసరి చేయాలని అన్నారు. విశ్వవిద్యాలయ ఆవరణలోని అన్నికళాశాలల్లో విద్యార్థులకు, అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి ఫేస్‌రికగ్నిషన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్యరవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఫేస్‌రికగ్నిషన్ వలన క్రమశిక్షణ అలవడి కళాశాలకు క్రమం తప్పకుండా వస్తారని ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. సమావేశంలో పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి సురేష్‌కుమార్, ఓఎస్డీ టు వీసీ డాక్టర్ బి హరికాంత్, విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సరసిజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్

అజ్ఞానపు చీకట్లను పారదోలేదే దీపం..

● హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతీ స్వామి ● గంగమ్మకు దీప హారతి



హారతి ఇస్తున్న విద్యారణ్యభారతీ స్వామి



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అజ్ఞానపు చీకట్లను దూరం చేసి జ్ఞాన జ్యోతులను నింపేదే దీపం అని హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతీ స్వామి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని జక్కుల చెరువు వద్ద హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతీ స్వామి హాజరై గంగమ్మకు దీపార్చన, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. నిత్యం ప్రతి ఇంట్లో ఉదయం, సాయంత్రం సమయంలో దీపారాధన చేస్తే శుభప్రదమన్నారు. ఏ కార్యం చేపట్టిన జ్యోతిని వెలిగించే గొప్పదనం హిందూ సంస్కృతిదని అన్నారు. దీపం వెలిగిస్తే మనిషిలోని అహం అంతమై కాంతుల్లో ఆశలు చిగురిస్తాయని అన్నారు. నిత్యం దీపాన్ని ఆరాధిస్తే జ్ఞానం, సంపద సమకూరుతుందన్నారు. మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి నీటిలో దీపాలను వదిలారు. కార్యక్రమంలో వేదపండితులు రాచర్ల రఘురామశర్మ, రాచర్ల విశ్వనాథశర్మ, ఉత్సవ సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

వైభవంగా దీపోత్సవం

● కార్తీకమాస ముగింపు సందర్భంగా ధర్మపురి,వేములవాడల్లో భక్తుల ప్రత్యేక పూజలు



ధర్మపురిలో దీపోత్సవం కార్యక్రమం



కార్తీక మాసం ముగింపు హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో గోదావరి నదీతీరాన అనంత దీపోత్సవం కార్యక్రమాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నదీతీరాన శివలింగానికి రుద్రాభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. నదీతీరాన గల స్నానఘట్టాల మెట్లపైన ప్రత్యేకంగా దీపాలు ఏర్పాటు చేశారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు నదిలో దీపాలు వదిలి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. కార్యక్ర మంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ధర్మపురి సీఐరాంనర్సింహారెడ్డి, శారదా మహిళామండలి, వాసవి మహిళామండలిసభ్యులు, కరీంనగర్ తిరుమల సేవా గ్రూపుసభ్యులు, పెద్దపల్లి శ్రీవల్లిసేవాగ్రూపు సభ్యులు, స్థానికమహిళలు, సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.



వేములవాడలో భీమన్న సన్నిధిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

భీమన్న సన్నిధిలో కార్తీక వేడుకలు

వేములవాడ టౌన్: వేములవాడ భీమేశ్వరాలయంలో కార్తీక వేడుకలు గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో చివరిరోజున ఆలయఈవో రమాదేవి కార్తీకదీపాలను వెలిగించి ప్రారంభించగా, సుహాసినులు, భక్తులు కార్తీకదీపాలు వెలిగించారు. సుహాసినులకు వాయినం ఇచ్చి పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులతోపాటు స్వామివారి ఫోటోను ఈవో అంద జేశారు. దీంతో కార్తీక మాసోత్సవాలు ముగిశాయి.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం స్వల్పంగా నీరు వచ్చి చేరుతోంది. ఎగువప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 9,338క్యూసెక్కుల వరదవచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీకాలువ ద్వారా 650క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 8వేల క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం మిషన్‌భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 457 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 80.501 టీఎంసీలు కాగా అంతేస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

షార్ట్‌సర్క్యూట్‌తో హార్వెస్టర్‌లో మంటలు

● రూ.5 లక్షల ఆస్తి నష్టం

జగిత్యాలరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలంలోని పొలాసగ్రామంలో గురువారం వరికోస్తుండగా హార్వెస్టర్‌కు షార్ట్‌సర్క్యూట్ సంభవించి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్‌వెంటనే కిందకి దూకి ఫైర్‌సిబ్బందికి ఫోన్‌చేశారు. తక్షణమే స్పందించిన ఫైర్‌సిబ్బంది మంటలు ఆర్పివేయడంతో పెనుప్రమాదంతప్పింది. ఈప్రమాదంలో హార్వెస్టర్ యజమానికి సుమారు రూ.5లక్షలు నష్టం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌వో కృష్ణకాంత్, ఏఎల్ఎఫ్ఎఫ్ వెంకటేశ్వర్లు, ఆపరేటర్లు మల్లేశం, ప్రణయ్, ఫైర్‌ఫైటర్స్ భాస్కర్, రాజేందర్, గంగేష్ పాల్గొన్నారు.



హార్వెస్టర్‌కు అంటుకున్న మంటలను ఆర్పివేస్తున్న ఫైర్ సిబ్బంది

ఉత్తమ సహకార సంఘంగా సుల్తానాబాద్ సొసైటీ



అవార్డు అందుకుంటున్న సుల్తానాబాద్ సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్

సుల్తానాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల వారోత్సవాలను పురస్కరించుకొని సుల్తానాబాద్ సహకారసంఘాన్ని ఉత్తమ సంఘంగా ఎంపికచేశారు. గురువారం హైదరాబాద్ జరిగిన అవార్డుల ప్రధాన కార్యక్రమంలో సొసైటీచైర్మన్ శ్రీగిరిశ్రీనివాస్ అవార్డు అందుకున్నారు. సహకార వారోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉత్తమ చైర్మన్ అవార్డులను ప్రదానం చేశారు. సహకారసంఘాల సమాఖ్య మాజీజాతీయ అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావు చేతులమీదుగా శ్రీనివాస్ అవార్డును అందుకున్నారు. చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ సభ్యుల సహకారం, సంఘంపై విశ్వాసం వల్లే విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. సంఘ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, కేడీసీసీబ్యాంక్ అధ్యక్షుడు రవీందర్‌రావు, అధికారులు, పాలకవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎల్లారెడ్డిపేట ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డికి..

ఎల్లారెడ్డిపేట: సహకారసంఘాన్ని బలోపేతం చేయడంతోపాటు లాభాల బాటలోకి తీసుకురావడానికి విశేషకృషి చేసిన ఎల్లారెడ్డిపేట ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి సహకార ఉత్తమ ప్రదర్శన అవార్డును అందుకున్నారు. తెలంగాణ సహకార సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సహకార సంఘ భవనంలో నిర్వహించిన వారోత్సవాల్లో భాగంగా గురువారం అవార్డుల ప్రదానోత్సవకార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమసేవలు అందించినందుకు కృష్ణారెడ్డి నాఫ్‌స్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకోవడంపై ప్యాక్స్ డైరెక్టర్లు, రైతులు, పలువురు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు అందుకుంటున్న ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి

ఆలయంలో అన్నదానం

జగిత్యాల టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రం లోని కరీంనగర్ రోడ్డులో గల అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం దీక్షా స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ నిర్వహకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గురు స్వాములు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆలయంలో దీక్షా స్వాములకు నవంబరు 20 నుంచి జనవరి 1 వరకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు బండారి లక్ష్మీనారయణ, మానాల కిషన్, నీలం దశరథ రెడ్డి, మార కైలాసం, పల్లెర్ల రాజు, రవీందర్‌రావు, దీటి సతీష్, పులిసే శ్రీనివాస్, మొదటి రోజు అన్నదాన దంపతులు కోటగిరి గంగన్న, అనురాధా, అయ్యప్ప దీక్షా స్వాములు పాల్గొన్నారు.

అయ్యప్ప పాట చిత్రీకరణ

రాయికల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట నాగాలయం పరిసరాల్లో గురువారం అయ్యప్ప పాట చిత్రీకరణ కళాత్మకంగా జరిగింది. శ్రీరాముల సత్యనారాయణ రచన, గానంతో రూపొందించనున్న ఈ అయ్యప్ప భక్తి గీతం సత్తన్న పాటలు యూట్యూబ్ ఛానల్ ద్వారా త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రీకరణలో కడకుంట్ల సాత్విక్ అయ్యప్ప స్వామి పాత్రలో నటించగా, అయ్యప్ప భక్తునిగా శ్రీరాముల సత్యనారాయణ నటించారు. కెమెరామెన్ సాయి ప్రత్యేక దృశ్యాలను చిత్రీకరించారు. భక్తిభావం నిండిన ఈ గీతం భక్తులను ఆకట్టుకుంటుందని నిర్వాహకులు తెలిపారు.

గోనె కాపు సంఘం అధ్యక్షుడికి సన్మానం

రాయికల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాయికల్ గోనె కాపు సంఘం నూతన అధ్యక్షునిగా ఎన్నికైన కుంబాల శ్రీనివాస్ రెడ్డిని పీఆర్‌టీయూ టీఎస్ రాయికల్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు ఆకాంక్షించాలని కోరారు. పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు బోయినిపెల్లి ఆనంద్ రావు, ప్రధాన కార్యదర్శి యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, సోషల్ ఫోరం అధ్యక్షుడు త్రిలోచన రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు అంతడుపుల గంగరాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఏవీఎన్ రాజు, పొన్నం రమేష్, గాజెంగి రాజేశం, దాసరి రామస్వామి, లక్కాడి రాజరెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కన్నవేణి మల్లారెడ్డి, దొంతి సతీష్, బాపు రావు, ఊషకోల రాము, మహేష్, సురేందర్ పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ

బీర్‌పూర్,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీలకు అక్షర పాఠశాల విద్యార్థి ఎంపికైయ్యాడు. డిసెంబర్ నెల 6,7, తే దీలలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే అస్మిత ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీలకు బీర్‌పూర్ మండలంలోని అక్షర పాఠశాలలో చదువుతున్న విద్యార్థి ఆడెపు హర్షిత్ ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఫైడి మారుతి తెలిపారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన లీగ్ పోటీల్లో అండర్ 14 పాయింట్ ఫైట్ 58 కిలోలల విభాగంలో పాల్గొని తన ప్రతిభను కనబరచి సిల్వర్ మెడల్ సాధించినట్లు మారుతి తెలిపారు. ఈ సందర్భంగా ఖేలో కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థి హర్షిత్‌ను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు, పలువురు అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మోక్షమెప్పుడో..?

-రంగరావుపేటలో జాబితాలకే పరిమితమైన లబ్ధిదారుల ఎంపిక -ప్రొసీడింగ్స్ ఇవ్వక ప్రారంభం కాని పనులు


ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ఖాళీ స్థలం చూపుతున్న లబ్ధిదారు

మెట్‌పల్లి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం రంగరావుపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మోక్షమెప్పుడు కలుగు తుందో నని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. పేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకు వచ్చింది. ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేసింది. కానీ అధికారులు, ఇందిరమ్మ కమిటీల మధ్య సమన్వయలోపం వల్ల ప్రతిపాదన దశలోనే ఉంది. గ్రామంలో కమిటీ సభ్యులు 24 మంది అర్హులను గుర్తించి ఉన్నతాధి కారులకు జాబితాను అందజేశారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడంతో గ్రామంలో నేటికి ఒక్క ఇంటికి కూడా ముగ్గు పోయలేదు.

● ప్రొసీడింగ్స్ కోసం ఎదురుచూపులు

గ్రామసభలో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను చదివి వినిపించారు. గ్రామంలోని దివ్యాంగురాలైన ఎర్ర రజితకు తల్లిదండ్రులు పాత ఇల్లును ఇచ్చారు. అందులోనే భర్త, కూతురుతో కలిసి ఉంటుంది. ఇందిరమ్మ కమిటీ సభ్యులు అర్హులుగా గుర్తించింది. ఆమెకు ఇళ్ల మంజూరు అయిందని కట్టుకోవాలని పంచాయతీ కార్యదర్శి తెలపడంతో ఉన్న ఇల్లును కూల్చి వేసి గ్రామంలో కిరాయికి ఉంటోంది. అదే విధంగా స్వంత స్థలం ఉండి కిరాయికి ఉన్న చాలా మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేసి ముగ్గు పోస్తే నిర్మాణాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

నిర్మాణం కోసం పాత ఇంటిని కూల్చా

-రజిత, లబ్ధిదారు, రంగరావుపేట



నాకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. కట్టుకోవాలని పంచాయతీ కార్యదర్శి తెలపడంతో పాత ఇల్లును కూల్చి కిరాయికి ఉంటున్నాను. ఇంటికి ముగ్గు పోయాలని కార్యదర్శిని అడిగినప్పుడల్లా పై నుంచి ఆర్డర్ వచ్చిన తరువాత పనులు ప్రారంభిం చాలని చెబుతున్నాడు.

జాబితాను ఆలస్యంగా ఇచ్చారు

-సురేష్, మెట్‌పల్లి ఎంపీడీవో

ఇందిరమ్మ కమిటీ గ్రామంలో ఎంపిక చేసిన జాబితాను ఆలస్యంగా ఇచ్చారు. దీంతో మంజూరుకు ఆమోదం ఆలస్యం అవుతోంది. త్వరలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారం భిస్తాం. గ్రామాలో ఎవరినీ ఇళ్లు కూల్చి వేసుకోవాలని తెలపలేదు.

పల్లె పోరుకు కసరత్తు

(ఐదో పేజీ తరువాయి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు దక్కాలంటే పంచాయతీల ఎన్నికలు నిర్వహహించాల్సి ఉంది.

● ఇప్పుడేం చేద్దాం..

ఎన్నికలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రధాన పార్టీల్లోని ఆశావహుల్లో గందరగోళం నెలకొంది. ఇప్పటి వరకు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావించిన నాయకులు సందిగ్ధంలో పడిపోయారు. పరిషత్ ఎన్నికలు పార్టీల పరంగా ఉండడంతో ఎక్కువ మంది అటువైపే మొగ్గు చూపారు. తద్వారా రాజకీయంగా పట్టు నిరూపించుకోవచ్చని భావించారు. కానీ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తేలాకే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. దీంతో పరిషత్ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియకపోగా అప్పటి వరకు ఆగాలా లేక జీపీ ఎన్నికల బరిలోకి దిగాలా అని నాయకులు ఆలోచనలో పడ్డారు. మూడు ఎన్నికలు ఒకేసారి జరిగితే ఏదో పదవికి పోటీ చేసి సత్తా చాటాలని అనుకుంటే ప్రభుత్వం ముందుగా పంచాయతీ ఎన్నికలకే మొగ్గు చూపింది. ఇప్పట్లో పరిషత్ ఎన్నికలు జరిగే అవకాశం లేకపోవడంతో అన్ని పార్టీల్లోని ఆశావహుల్లో హైరానా నెలకొంది.

బాల్య వివాహాలను నిర్మూలించాలి


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

సారంగాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిర్మూలించాలని ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలిక పాఠశాలలో ఏర్పాటు చేసిన బాల్య వివాహల నిర్మూలన అవగాహన సదస్సుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహలు జరిగినట్లయితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు బాల్య వివాహాల గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్ళాలని అన్నారు. ఈ మేరకు బాల్య వివాహాలు జరపకుండా ఉండేందుకు ప్రతిజ్ఞ చేయించారు. హెల్ప్‌లైన్ నెంబర్లను ఇచ్చారు. ఈ అవగాహన సధస్సులో తహసీల్దార్ వహిదోద్దిన్, ఎంపీడీవో గంగాధర్, అధ్యాపకులు. విద్యార్థుల తల్లిండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

●మెట్‌పల్లి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో బాల్య బాల్య వివాహాలు చట్టరీత్యా విరుద్ధమని జిల్లా ఉమెన్, చైల్డ్ వెల్ఫేర్ అధికారి శ్రీకన్య అన్నారు. గురువారం మండలంలోని చౌలమద్ది గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా బాల్య వివాహాలతో కలిగే అనర్థాల గురించి అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా గ్రామస్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా చైల్డ్ వెల్ఫేర్ జిల్లా అధికారి శ్రీకన్య మాట్లాడుతూ బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, కారోబార్ వాసాల రాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగ్గయ్య, ఏఎన్‌మ్ సుజాత, ఐకేపీ వీవోఏలు పవిత్రవాణి, హరిత, కవిత, అంగన్‌వాడీ టీచర్సు కవిత, దీప, ఆశాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

'ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవాలి'


మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని 138 సర్వే నంబర్‌లో ఆక్రమణకు గురైన 20 గుంటల భూమిని మున్సిపల్ అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20 గుంటల భూమి ఆక్రమణకు గురైన విషయమై గతంలో పలు మార్లు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశానన్నారు. కలెక్టర్ ఈ విషయమై విచారణకు ఆదేశించారన్నారు. గతంలో ఈ భూమి విషయమై కబ్జాదారులు ఇంజక్షన్ ఆర్డర్ కోసమే ప్రయత్నించారు కాని ఎప్పుడూ యాజమాన్య హక్కుల గూర్చి ప్రయత్నించ లేదన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి

ప్రజలకు అసౌకర్యంగా ఉన్నదని జగిత్యాల పట్టణంలోని జంబిగద్దె వద్ద ఉన్న నిర్మాణాన్ని కూల్చి వేసిన జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌కు యావర్ రోడ్డులో జరిగిన అక్రమాలు కనిపించవా అని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజలకు అసౌకర్యమని భావించి జంబిగద్దె వద్ద నిర్మాణాన్ని కూల్చివేయడం సరైనదే అయినపుడు నిత్యం వేలాది మంది ప్రయాణిస్తున్న యావర్ రోడ్డుపై చేపట్టిన అనేక అక్రమ నిర్మాణాల సంగతి ఏంటని ఆయన అన్నారు. జంబిగద్దె వద్ద కూల్చి వేతకు పాల్పడినట్లు యావర్ రోడ్డు ఆక్రమణలను కూడా వెంటనే కూల్చి వేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

పెగడపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోల్లు త్వరితగతిన పూర్తి చేయాలని పెగడపల్లి మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. గురువారం పెగడపల్లి మండలంలోని రాజరాంపల్లిలోని ఐకెపి ఆద్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపిఎం రవివర్మతో కలసి మార్కెట్ చైర్మన్ రాములు గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో ధాన్యం పేరుకుపోకుండా త్వరత్వరగా తూకం వేస్తూ మిల్లులకు తరలించాలని సూచించారు. తడిచిన రంగుమారిన ధాన్యం సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సన్నరకం ధాన్యం కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ వైస్ చైర్మన్ సురకంటి సత్తిరెడ్డి, డైరక్టర్ చాట్ల విజయభాస్కర్, నిర్వాహకులు లత తదితరులు ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి

కోరుట్ల రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని ఉద్యాన వన విస్తరణ అధికారి అన్వేష్ అన్నారు. గురువారం మండలంలోని మాదాపూర్ గ్రామంలో వ్యవసాయ, సహాకార శాఖ సహాకారంతో రైతులకు ఆయిల్ ఫాం సాగుపై అవగాహన కల్పించారు. అయిల్ ఫాం సాగుతో రైతులకు అందే సబ్సీడిపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాఘవేంద్ర, ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణ్, సీఈఓ రాజేందర్‌లు రైతులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

మెట్‌పల్లి టౌన్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు విడుదల చేసిన నిధుల ద్వారా తమ వార్డుకు నిధులు అందించి అభివృద్ధి పనులకు సహకరించాలని మెట్‌పల్లి బీజేపీ 14వ వార్డు ఇంచార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొనికెల నవీన్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. గురు వారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కలిసి, కేంద ప్రభుత్వం ఆయా మున్సిపాలిటీలకు రూ.18.20 కోట్ల అభివృద్ధి నిధులను విడుదల చేసిందన్నారు.

'రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'


ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్ యార్డులో చైర్మెన్ పన్నాల అంజిరెడ్డితో కలసి జువ్వాడి నర్సింగరావు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడారు. రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులు ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తేన్నాడని అన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కొరకు ప్రభుత్వం అండగా ఉండి పని చేస్తుందని అన్నారు. రైతులు దళారులను నమ్మి మోసం పోకుండా ప్రతి గ్రామంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని అన్నారు.

రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కృష్ణ చైతన్య, సింగిల్ విండో చైర్మెన్ భూంరెడ్డి, నాయకులు కొంతం రాజం, తిరుమల గంగాధర్, అన్నం అనిల్, సత్యనారాయణ గౌడ్, శశీందర్ రెడ్డి, అడెపు మధు, ఎంబేరి నాగభూషణం, పుప్పల ప్రభాకర్, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధికి కృషి

కోరుట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం పట్టణంలోని సీనారే కళా భవనంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరి చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు అందించి ఆడపడుచు కట్నం కింద చీర కానుకగా అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ పన్నాల అంజిరెడ్డి, నాయకులు మహిపాల్ రెడ్డి, శశీందర్ రెడ్డి, కొంత రాజం, గంగాధర్ గౌడ్, అన్నం అనిల్ కుమార్, పుప్పాల ప్రభాకర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి నిలదీత

కథలాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మరణ ధ్రువీకరణ పత్రం కావాలని అడిగితే డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని మండలంలోని గంభీర్‌పూర్ పంచాయతీ కార్యదర్శి లక్ష్మయ్యను శుక్రవారం గ్రామస్థులు నిలదీశారు. ఇంటి నిర్మాణాలకు అధికంగా రేటు వేస్తుండడం పట్ల మండి పడ్డారు. దాదాపు అరగంట సేపు పలు సమస్యలపై ప్రశ్నించారు. తాను డబ్బులు ఎవరినీ డిమాండ్ చేయలేదని కార్యదర్శి సమాధానం ఇచ్చే ప్రయత్నం చేసినా గ్రామస్థులు సంతృప్తి చెందలేదు. మరణించిన వ్యక్తికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడం వల్లే ధ్రువీకరణ పత్రం జారీ చేయలేదని కార్యదర్శి పేర్కొన్నాడు.

సిర్పూర్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

మల్లాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సిర్పూర్ సొసైటీ పాలకవర్గం గురువారం కోర్టు ఆదేశాలతో తిరిగి పదవీ బాధ్యతలు చేపట్టింది. గత సీఈవో చేసిన అక్రమాలపై తగు చర్యలు తీసుకోవాలని పాలక వర్గం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా చైర్మన్ అంజిరెడ్డి మాట్లాడుతూ అధికారులు ఆకారణంగా పాలక వర్గంను రద్దు చేయడంపై కోర్టుకు వెళ్లగా జిల్లా అధికారులు తిరిగి తమను కొనసాగాలని పేర్కొన్నాని తెలిపారు. ఈవో ద్వారా నెలకొన్న పలు అక్రమాలను పేర్కొంటూ ప్లా కార్డులను ప్రదర్శిస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

-అదనపు కలెక్టర్ లత

ఎండపల్లి, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, కొనుగోలు కేంద్రంలో రైతులను ఇబ్బంది పెట్టవద్దని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. బుధవారం ఎండపల్లి గ్రామంలో ఆకస్మిక తనిఖీ చేశారు. అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ధాన్యాన్ని తూకం వేసిన వెంటనే మిల్లులకు పంపించాలని అన్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎడ్ల తహశీల్దార్ అనిల్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల ఎమ్మెల్యే పదవి పోతే నాకేం ప్రయోజనం

-మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఎమ్మెల్యే పదవి పోతే నాకేంటి ప్రయోజనం అంటూ మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. అయినా ఎమ్మెల్యే సంజయ్ పదవి పోవాలని తాను కోరుకోవట్లేదని అన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిబంధనల ప్రకారం స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని అన్నారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో రాహుల్‌గాంధీ ఆలోచనలకు అనుగుణంగానే తాను నడుచుకుంటానని జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల కోసం అందరం పని చేస్తామని అన్నారు. జగిత్యాలలో ఒక్కొక్కరు పార్టీలకు అతీతంగా పని చేస్తే నేను పార్టీ పరంగా పని చేయలేనా అని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

పంపిణీకి సిద్ధంగా ఇందిరమ్మ చీరలు

మల్యాల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని మహిళలకు పంపిణీ చేసేందుకు ఇందిరమ్మ చీరలు సిద్ధంగా ఉన్నాయి. నూకపల్లి ఏటీసీ, మల్యాలలోని సెర్ప్ కార్యాలయంలో చీరలు నిలువ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని మహిళలకు ఇందిరమ్మ చీరలను వారం రోజుల పాటు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం మండలంలోని స్వశక్తి సంఘాల వీవోఏలతో సమావేశం నిర్వహించారు. పంపిణీపై పలు సూచనలు చేశారు. పంచాయితీ ఎన్నికల నియమావళి అమలుల్లోకి రానుందనే ప్రచారం నేపథ్యంలో రెండు రోజుల్లో చీరల పంపిణీ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంచే ప్రారంభించడానికి అధికార పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా మహా రుద్రాభిషేకం

కోరుట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో అంజనేయ స్వామి దేవాలయంలో గురువారం కార్తిక అమావాస్య పురస్కరించుకొని మహా రుద్రాభి షేకం, అన్నపూజ మహోత్సవంను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన అర్చకులు ఉదంటి శ్రీకాంత్, శ్రీధర్, శ్యాంసుందర్‌లు రుద్రాభిషేకం, అన్న పూజ కార్యక్రమాన్ని జరిపారు. దేవాలయ నిర్వహకులు అన్నదాన కార్యక్రమాన్ని జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈఓ విక్రం, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్యలతో పాటు భక్తులు పాల్గొన్నారు.

'గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం'


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అభివృద్ధి చేయడమే తన ప్రధాన ధ్యేయమని, రాష్ట్రంలోనే జగిత్యాల నియోజకవర్గానికి అత్యధికంగా నిధులు మంజూరు చేయించానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్ గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ. 18 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గురువారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు 11.50 కోట్లు జగిత్యాలకు మంజూరు చేయించానని, గ్రామంలో తూము ఏర్పాటు చేసి రైతు సాగునీటి సమస్యను పరిష్కారించానని తెలిపారు. జాబితాపూర్ గ్రామంలో సైతం కోట్ల నిధులతో అత్యధిక సామర్థ్యం గల గోదాం నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. గోదాం ఏర్పాటు వల్ల ధాన్యం నిల్వ చేసుకోవడమే కాకుండా రైతులు బ్యాంక్ లోన్ పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. డిమాండ్ కు తగ్గట్టు నిల్వచేసిన పంట ఉత్పత్తులను అమ్మి రైతులు లాభాలు పొందవచ్చునని తెలిపారు.

గ్రామాల్లో అన్ని కుల సంఘాలకు నిధులు మంజూరు చేశానని, కాట మయ్య కిట్లతో గీతకార్మికులకు భద్రత పెరిగిందన్నారు. జాబితాపూర్ గ్రామంలో నూతన గ్రామపంచాయితీకి నిధులు మంజూరు చేశానని, పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ఉచిత కరెంట్, సన్నబియ్యంపంపిణీ, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. 50 మందికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించానని, ఇందులో 22 మందికి లక్ష చొప్పున బిల్లులు ప్రభుత్వం జమ చేసిందన్నారు. అభివృద్ధి కోసం అందరితో కలిసి పనిచేస్తానని, కొందరు కావాలని బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ముస్కు ఎల్లారెడ్డి, పెండెం నాగలక్ష్మీరాములు, డీఇ మిలింద్, ఎంపీఓ రవిబాబు, ఏఈ రాజమల్లయ్య, సీనియర్ నాయకులు బాలముకుందం, అంకం సతీష్, నక్కల రవీందర్‌రెడ్డి, హరికిషన్‌రావు, రాజాగౌడ్, నరేష్, తిరుపతి, గంగారాం, గ్రామనాయకులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ధర్మపురి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో రౌడీ షీటర్లు, సస్పెక్టెడ్ పర్సన్స్‌కు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీ షీటర్లు, సస్పెక్టెడ్ పర్సన్‌లను ఆయన పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. అనంతరం వారికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మెదులుకోవాలని ఆయన సూచించారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే తిరిగి కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. మంచి ప్రవర్తనతో ఉండాలని వారికి ఆయన తెలిపారు.

రైతులకు అవగాహన

కథలాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వరి కోతలు పూర్తయిన అనంతరం వాటిని కాల్చివేయ వద్దని సూచిస్తూ శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ అధికారిణి యోగిత నేతృత్వంలో సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈఓలు శేఖర్, సుష్మా, సంధ్యారాణి, హరీశ్, రైతులు తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

మల్లాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మార్క్‌ఫెడ్ అధికారులు మక్కల కొనుగోళ్లను చేయాలని, రైతులను ఇబ్బంది పెట్టందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఆయన గురువారం మల్లాపూర్‌లో గల ప్రభుత్వ మొక్కజొన్న కొనుగోలు కేంద్రంను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో నెలొన్న సమస్యలను రైతులు ఆయనకు మొర పెట్టుకున్నారు.

కొనుగోళ్లు జాప్యం చేస్తున్నారని రైతులు విన్నవించగా మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు మార్క్‌ఫెడ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం రేగుంట గ్రామంలో సరిత అనే ఐకేపీ మహిళ వద్దకు వెళ్లి ఆమె సమస్యను అడిగి తెలుసుకున్నారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెనేజర్ కిరణ్‌కుమార్ అన్నారు. గురు వారం మండలంలోని బండలింగాపూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మంజూరు చేసిన బీమ చెక్కును ఖాతాదారుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంక్‌లోని ఖాత దారులకు పీఎమ్‌జేజేబీవై ద్వార భరోసా కల్పించి వారి కుటుంబాలకు అండగా ఉంటుందన్నారు. ముద్దుల రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు రూ. 2లక్షలు బీమ చెక్కును అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భూమేశ్వర్ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

కోరుట్ల రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మండలంలోని కల్లూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు గురువారం రాస్తారోకో చేశారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న మాడల్ స్కూల్‌కు విద్యార్థులను తరలించి తిరిగి వస్తున్న బస్సులను అడ్డుకొని రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కోరుట్ల పట్టణానికి సుమారు నాలుగు కిలో మీటర్ల దూరం ఉన్న కల్లూర్ గ్రామానికి బస్సు సౌకర్యం లేక గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామం నుంచి కోరుట్ల పట్టణానికి ఆటోలో రావలసి వస్తుందన్నారు. కల్లూర్, సర్వరాజుపూర్ గ్రామల ప్రజలు గ్రామం నుండి బస్సు సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాలు ఆశ్రయించ వలసి వస్తుందని అన్నారు. ఈ విషయంను అక్కడ ఉన్న ఆర్‌టీసీ సిబ్బంది డిపో మేనేజర్ మనోహర్ దృష్టికి ఫోన్ ద్వారా తెలపగా సమస్యల పరిష్కారం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయి పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్యతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.